తిరిగిరాని వసంతం

— ఇల్యాస్ అహ్మద్ —

"మమ్మీ... మమ్మీ" అని బిగ్గరగా పిలుస్తున్న చైతన్య పిలుపుకు కిటికీలోనుండి మల్లె పందిరి వైపు తదేకంగా చూస్తున్న సుజాత ఉలిక్కిపడి వెనుతిరిగింది. హాల్లో ఓ అపరిచిత వ్యక్తి చేతుల్లో వుండి చేతులు సాచి పిలుస్తున్న చైతన్యను చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపోయి ముందుకు నడిచింది.

"అరె!... ఏమిటిది? ఏమైంది బాబూ?" అంటూ మోకాలికి వున్న కట్టును చూస్తూ ఆందోళనగా చేతులు చాపిన సుజాత వొళ్ళోకి వాలిపోయాడు చైతన్య.

"మరేం ఫరవాలేదు, గాభరా పడకండి. రన్నింగ్ రేస్‌లో పరిగెత్తుతుంటే చిన్న రాయి తగిలి క్రిందపడ్డాడు. డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళాను. ఆందోళన పడవలసిన అవసరం లేదన్నాడు డాక్టర్. నాల్గు రోజుల్లో నయమైపోతుంది." అని చెప్తున్న అతనివైపు సాభిప్రాయంగా చూస్తూ —

"మీరు చాలా శ్రమ తీసుకున్నట్లున్నారు" అంది.

"శ్రమేముంది! చిన్నపిల్లలు, స్కూల్లో వారికేమైనా దానికి బాధ్యులం మేమే. అయినా చైతన్య అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం వుంది. బికాజ్ హి ఈజ్ రియల్లీ బ్రిల్లియంట్. నేను చెప్పే ఇంగ్లీషులోనే కాకుండా మిగిలిన సబ్జెక్ట్సులో కూడా చాలా చురుకైనవాడు" అన్నాడు.

"నేను క్రింద పడకపోతే ఆ శీనుగాడి కంటే నేనే ఫస్టొచ్చేవాణ్ణి కదు మాష్టారూ?"

"ఓ యస్, తప్పకుండా నువ్వే వచ్చేవాడివి" అన్నాడు వీపు నిమురుతూ.

"ఆఁ వీడికి అసలు తెలివికంటే అతితెలివి ఎక్కువలెండి" అంది సుజాత.

"వెళ్ళొస్తానండీ" అంటూ లేవబోతున్న అతనివైపు తిరిగి "ఒక్క నిముషం కూర్చోండి" అంటూ లోపలికి వెళ్ళి కాఫీతో తిరిగివస్తున్న సుజాత వేపు చూసి చిరునవ్వు నవ్వాడతను.

* * *

ఎగ్జిబిషన్‌లో అంతా కోలాహలంగా వుంది. రకరకాల మనుషులు, రంగు రంగుల దుస్తుల్లో వస్తువుల ప్రదర్శనేమోగాని వీళ్ళని చూస్తుంటే కన్నుల కింపుగా వుంది. ప్రక్కన గ్రామ్‌ఫోన్‌లో జేసుదాస్ 'రంగ్‌బిరంగే ఫూల్ ఖిలేఁ హైఁ, లోగ్ భి ఫూలోఁ జైసే' అంటూంటే నిజమేననిపిస్తోంది.

తను వచ్చి అరగంట దాటింది. జనం తను వచ్చినప్పటికంటే రెండింతలైనారు. సరైన సమయానికి తను రాడు కానీ నన్ను రమ్మంటాడు. ఎంత ఎగ్జిబిషనైతే మటుకు చూసిందే విసుగ్గా వుంది. వాచీ చూశాడు పావు తక్కువ ఏడు. విసురుగా వెనుతిరిగేసరికి ఎదురుగా తెల్లటి చీరలో, మెరిసే కళ్ళతో అప్సరసలా వున్న ఆమె.

"గుడ్ ఈవినింగ్ మాష్టారూ!" అంటూ ముందుకొచ్చిన చైతన్యతో "గుడ్ ఈవినింగ్, షికారుకు బయల్దేరావన్నమాట" అంటూ బుగ్గలు నిమిరాడు.

"స్కూల్లో చెప్పారట ఎవరో, నిన్నటినుండి వేధిస్తున్నాడు తీసుకెళ్ళమని వెధవ. ఇక తప్పలేదు. ఏదో కాస్సేపు వుండి పోదామని వచ్చాం" అంది సుజాత నవ్వుతూ.

"ఒక్కణ్ణే తిరుగుతున్నాను ఇందాకట్నుండీ. బోర్ కొట్టేస్తోంది. ఇక వెళ్ళిపోదామని నిశ్చయించుకున్నాను. మా ఫ్రెండ్ వస్తానన్నాడు. ఇంతవరకూ పత్తాలేదు" నవ్వుతూ అంటున్న అతని వైపు చూసి చిరునవ్వు నవ్వింది సుజాత.

"మాష్టారూ! అటు చూడండి, ఆ చక్రం ఎలా తిరుగుతోందో. అబ్బ వాళ్ళు అందులో కూర్చుని ఎంత బాగా తిరుగుతున్నారో! మాష్టారూ మనం కూడా వెళ్దామా" అంటూ హడావుడి చేస్తున్న చైతన్యవైపు కోపంగా చూస్తూ "వద్దు, కళ్ళు తిరుగుతాయి" అంది సుజాత.

"ఫరవాలేదు, నేను తీసుకువెళతాను. పిల్లలు చిన్న చిన్న కోరికలను తీర్చకపోతే వాళ్ళు చాలా నిరుత్సాహ పడిపోతారు" అంటూ సమాధానం కోసం కూడా చూడకుండా తీసుకెళుతున్న అతను వైపు చూస్తూ నిలుచుంది. బాబు అతని ఒళ్ళో కూర్చుని కేరింతలు కొడుతూ ఏవేవో మాట్లాడుతున్నాడు. అతను కూడా వాటికి సమాధానాలు ఓపిగ్గా ఇస్తున్నాడు. కొద్దిసేపట్లోనే ఎంత దగ్గరైపోయాడు బాబు! చిన్నపిల్లల మనస్సు చాలా సున్నితమైనది. సంతోషమొక్కటే తెలుసు వాళ్ళకి. చిన్నపిల్లలతో కలిసిపోయి వాళ్ళతో గంటలతరబడి మాట్లాడటంలోనే వుందనిపిస్తుంది పెద్దవాళ్ళ గొప్పతనం. తను మాత్రం, వాడి మనసెరిగి ప్రవర్తించడం లేదనిపిస్తుంది. ఆలోచనల నుండి తేరుకుని చూసేసరికి బాబుని తీసుకొస్తూ అతను కనిపించాడు.

"చూడండి. ఇవి తీసుకోమంటే నేను తీసుకోను వద్దు అంటున్నాడు. ఎవరైనా ఏమైనా కొనిస్తే తీసుకోవద్దు అని మా మమ్మీ చెప్పింది అంటున్నాడు.

నే చెప్తానే అన్నా తీసుకోవట్లేదు.'' చేతుల్లోని రకరకాల బొమ్మలను చూపిస్తూ అన్నాడతను. ఒక్క క్షణం తటపటాయించి ''తీసుకో బాబు'' అంది సుజాత. ఏమంటుందోనని ఆందోళనగా చూస్తున్న చైతన్య ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

''హల్లో ! రజనీ, ఇక్కడున్నావా ? నీకోసమే వెతుకుతున్నాను.'' 'రజని' ఇతని పేరేమో ! అని అనుకొంటున్న సుజాతకు ఒక సమస్య తీరిపోయినట్లనిపించింది.

''ఇహ చాలించు ! నిన్ను నమ్ముకుంటే ఇంతే ! 'సిక్సోక్లాక్'కి వస్తానని చెప్పి ఇపుడా రావడం. ఇంకోసారి ఛస్తే నమ్మను'' అన్నాడు రజని.

''బాబ్బాబు ! ఈసారికి క్షమించెయ్, మరోసారి ఇలా చెయ్యను. నువ్వు ఛస్తే నామీద నమ్మకం పెట్టుకొనే వాళ్ళుండరు. కాబట్టి నువ్వు కలకాలం బ్రతికుండాలి'' అంటూ నవ్వుతున్న సుధీర్‌ను చూపించి. ''వారే ఈ సత్యవాక్పరి పాలకులు ! ఖర్మకొద్దీ నాకు దొరికారు'' అంటూ పరిచయం చేశాడు రజనీ సుజాతకు.

''నమస్కారం'' అంటున్న సుజాత వైపు తిరిగి ''మీరు మాత్రం నా సత్యవాక్పరిపాలనపై అనుమానం పెట్టుకోకండి; కొత్తవాళ్ళు పాతవాళ్ళు అని లేకుండా, ఎక్కడ ఎలా మాట్లాడాలో తెలియదు, వెధవకు'' అంటున్న సుధీర్ మాటలకు హాయిగా నవ్వేశాడు రజని. వాళ్ళ నవ్వుకు శృతి కలిపింది సుజాత.

* * *

పున్నమి వెన్నెల విరగ కాస్తోంది. ప్రకృతి కన్య వెన్నెల కిరణాలలో తడిసి పరవశించి చల్లగాలితో సరాగాలాడుతోంది. అణువణువునా అందం పొంగుతోంది. చూసే వారికి అంతరాంతరాల్లో అనురాగం వెల్లివిరుస్తోంది. కలువల్ని మత్తెక్కించే ప్రయత్నంలో చంద్రుడు తన శక్తినంతా వినియోగిస్తున్నట్లు వెన్నెల క్షణ క్షణానికి చిక్కబడుతోంది. పిట్టగోడ అంచు పైపైకెగబాకుతున్న సన్నజాజి తీగపై తుమ్మెద ఒకటి అప్పుడే పూస్తున్న సన్నజాజులతో సరాగాలాడుతోంది. పిల్లగాలి తోడుతో ఆ పూబాల, తుమ్మెదతో 'నీకు దొరుకుతానా !' అన్నట్లు, అటూ ఇటూ వూగుతోంది.

మనసంతా ఏదో అయిపోతూ మత్తులో సోలిపోతోంది. 'రజనీ కన్య'ను పాలిస్తున్న ఆ నెలరాజులో ఏదో రూపం ఆకృతి దాల్చుతూ, కనిపించీ కనిపించనట్లు కనిపిస్తోంది రజనీకి. కాలం స్థంభించింది. కళ్ళనిండా వెన్నెల, మనసునిండా వెన్నెల. ఆ రూపం...అవును...ఆమె...నవ్వుతోంది. సంపెంగ పువ్వులాంటి ముక్కు, క్రింద మధువులు జాలువారే ఎర్రని అధరాలు, విచ్చుకున్న అధరాల వెనుక మల్లెమొగ్గల లాంటి పలువరుస. అంతా తెల్లగా ... వెన్నెలలా ... చల్లగా నవ్వుతోంది.

ఇదేమిటి ఏదో ఝంఝామారుతం, చెవుల్లో మ్రోగుతోంది. అబ్బా ! ... ఆ రూపం ... అరే అదృశ్యమైపోతోంది. అబ్బా ! ...

రెండు చెవులు మూసుకున్నాడు. ప్రక్కకి తిరిగి చూస్తే దగ్గరగా సుధీర్ జిగ్‌జాగ్‌గా మ్రోగిస్తున్నాడు గిటార్‌ను.

'షటప్' గట్టిగా అరిచాడు. చెవుల్లో హోరు ఇంకా వినిపిస్తూనే వుంది.

''హమ్మయ్య ! ఎంతగా పిలిచానో తెలుసా ! వేరే ఉపాయం దొరకక ఇది తెచ్చాను'' అంటూ గిటార్‌ను ఆపి అన్నాడు సుధీర్.

''తిడితే తిట్టావ్‌గాని కొంచెం నా మాటలు కూడావిను. ఆ తర్వాత ఎంత తిట్టినా నేను భరిస్తాను, సరేనా ! ఇపుడు నువ్విలా మారడానికి, అదే ఎంత పిలిచినా పలుకకుండా మాటలు రానట్లుగా వుండటానికి కారణం, నాకు తెలుసు'' అన్నాడు సుధీర్.

మనసంతా అస్తవ్యస్తంగా చిరాగ్గా వుంది రజనికి. పైనుండి సుధీర్ మాటలు ఇంకా విసుగుని కల్గిస్తున్నాయి.

నీలాకాశంలో ఒక ప్రక్కనుండి నల్లటి మేఘాలు కమ్ముకొస్తున్నాయి. వాతావరణం అంతా స్థబ్దంగా వుంది.

''నీలో ఈ రోజు కానవస్తున్న సంచలనానికి కారణం ఆమె కదూ !''

అప్పుడు – ఇప్పుడు

ఒకప్పుడు మన దేశంలో
ఏ ప్రాంతంలో చూసినా
కనిపించేవారు నాయకులు.

ఇప్పుడూ మన దేశంలో
ఏ మూల చూసినా
కనిపిస్తారు నాయకులు.

అయితే
సేవా భావం రూపు గట్టిన
ప్రజా సేవకులు
పాత నాయకులు !

అధికార భావం రూపు దాల్చిన
ప్రజా ప్రతినిధులు
కొత్త నాయకులు !

— చల్లా రాధాకృష్ణశర్మ

''ఎవరు ?''

''అదే ఇందాక ఎగ్జిబిషన్‌లో నీతో మాట్లాడుతుందే...'' అంటూ ఆగాడు సుధీర్.

''క్షణం క్రితం వరకూ తన మానస సంద్రాన్ని కల్లోల పరచిన ఆ రూపం... అవును ఆమెదే !'' గుండె వేగంగా కొట్టుకుంటోంది.

''అవును... చైతన్య మమ్మీ'' అంటూ ఆగాడు రజనీ.

''చైతన్య మమ్మీ ఏమిటోయ్, సుజాత. పేరు కూడా తెలీదా ? సరిపోయింది.'' నవ్వుతూ అన్నాడు సుధీర్.

''సు...జా...త'' అస్పష్టంగా గొణిగాయి పెదవులు.

'నీకెలా తెలుసు ?' అమాయకంగా అడిగాడు రజని.

''ఆమె పేరే కాదు, ఇంకో విషయం కూడా తెలుసు, ఆమె భర్త పోయాడు. సాంఘికంగా చెప్పాలంటే ఆమె విధవ. వాళ్ళ వూరి నుంచి వచ్చి ఇక్కడ ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తోంది అంతకంటె ఎక్కువగా ఆమె గురించి తెలుసుకోవలసిన అవసరం రాలేదు నాకు,'' అంటూ ఆగాడు సుధీర్

నీలాకాశాన్ని అప్పటివరకూ యదేచ్ఛగా పరిపాలించిన నెలరాజును కారుమబ్బులు పూర్తిగా ఆక్రమించేశాయి. వెన్నెలను కోల్పోయి ప్రకృతి ఘోరుమంటోంది. పిల్లగాలి కాస్తా తుఫాను గాలిగా మారింది. పిట్టగోడపై తీగ గాలికి అల్లాడుతోంది. ఊపిరి బరువైపోతూంది. మనస్సులో ఏదో దిగులు ఆక్రమించుకుంది. గాలికి నేల వాలిన నైట్‌క్వీన్‌ను సుధీర్ నిలబెట్టి ఏదో ఊతగా పెడుతున్నాడు అంతకుముందు పరిమళాలు విరజిమ్మిన సన్నజాజులు నేలపై సుధీర్ కాళ్ళకింద నలిగిపోతున్నాయి.

''పద పద, వర్షం వచ్చేటట్లుంది గదిలోకెళ్దాం'' అంటూ చాపను చుడుతున్న సుధీర్‌ను అనుసరించాడు రజనీ.

* * *

''మాష్టారూ... అంకుల్ . అంకుల్'' ఆశ్చర్యంగా వెనుకకి తిరిగి చూశాడు రజనీ. చైతన్య రొప్పుతూ పరిగెత్తుకొస్తున్నాడు.

''ఆ . ఆ.. మెల్లగా రా, నేనిక్కడే నిలబడ్డాలే,'' అని నవ్వుతూ వెనుకకు రెండడుగులు వేశాడు. దగ్గరగా వచ్చిన చైతన్యను ఎత్తుకొని ముఖంలోకి చూశాడు. పసితనపు అమాయికత్వం ఆ ముఖంలో దోబూచులాడుతుంటే, హృదయంలో ఏదో భావం కలుక్కుమంది. ఎండకు కంది ఎర్రగా వున్న బుగ్గపై ముద్దు పెట్టుకున్నాడు. కర్చీఫ్ తీసి ముఖమంతా తుడిచాడు.

''అంకుల్ మీరెళ్ళిపోతారని త్వరగావస్తున్నాను. మళ్ళీ మీ యిల్లు నాకు తెలియదుగా, మీరెళ్ళిపోతే'' ఆయాసం తీర్చుకోడానికన్నట్లు ఆగాడు.

చైతన్య సంబోధనకు ఆశ్చర్యపోతూ అడిగాడు. ''బాబూ ! అంకుల్ అని ఎవరు పిలవమన్నారు ?''

''ఓ అదా ! మరేమో మమ్మీయే అలా పిలవమంది. ఏం, అలా పిలవకూడదా ?'' అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు చైతన్య.

ఒక్క క్షణం గుండె లయతప్పింది. ఏదో తెలియని అనుభూతి మనసంతా నిండిపోయింది.

''అలా పిలవచ్చా మాష్టారూ...''

''ఓ, అలాగే పిలువ్ బాబూ. నేనేమీ అనను'' అన్నాడు వెంటనే.

''అంకుల్, రేపు నా పుట్టినరోజు. మీరు తప్పకుండా రావాలి !''

''ఓ, తప్పకుండా వస్తాను ! అవునూ నీకెలా తెలుసు ? నీ పుట్టినరోజని'' అడిగాడు రజనీ.

''మమ్మీయే చెప్పింది. ఎవరితోచెప్ప వద్దన్నది. మీతో కూడా చెప్పవద్దన్నది.''

''నిజంగానా ! మరి చెప్పొద్దన్నా నాతో ఎందుకు చెప్పావ్ ? మమ్మీ కొట్టదా !'' ఆశ్చర్యంగా అడిగాడు రజనీ.

''ముందు అలా చెప్పింది. కానీ కొట్టదు. అయినా మీరు వస్తారుగా, నన్ను ఏమి అనదు'' ధీమాగా అంటున్న చైతన్యను చూస్తుంటే రజనికి ఏమనాలో తోచలేదు. ఎటూ తేలని ఆలోచనలు





మనసులో ముసురుకుంటుంటే మౌనంగా, మెల్లగా నడుస్తున్నాడు. చైతన్య మమ్మీ వద్దన్నా నాతో చెపుతున్నాడు. కాని సుజాత ఎందుకు అలా చెప్పి వుంటుంది ? నేను రావడం ఇష్టం లేదేమో ! మరి చైతన్యకేమని చెప్పేది ? రజని ముఖం ఆలోచనలతో వాడిపోవడం చూసి ఏమనుకున్నాడో చైతన్య "అంకుల్ మీరు రాకపోతే నేను మీతో మాట్లాడను" కోపం ఆదుర్దా మిళితమైన స్వరంతో అన్నాడు చైతన్య.

'అహ హః ఆలా కాదు. నేవస్తాలే" సమాధాన పరిచే యత్నంతో అన్నాడు.

"ఇదిగో ప్రామిస్ !?" ప్రశ్నార్థకంగా చేయి చాపిన చైతన్యను చూసి—

"ప్రా ... మి ... స్" దృఢంగా అంటూ చైతన్య చేయి నందుకున్నాడు రజని.

* * *

ఒకవైపు ఆనందం వేరొకవైపు సందేహం మనసును పీకుతుంటే గేటు తీసుకుని లోనికి అడుగు పెట్టాడు రజని. సన్నని కాలిబాట, ఇరువైపులా రకరకాల పూలమొక్కలు గాలికి తలలూపుతూ తనకు స్వాగతం చెపుతుంటే ముందుకు నడిచాడు రజని.

"టింగ్ టంగ్... టింగ్ టంగ్" కాలింగ్ బెల్ మోతకి చైతన్యకు అన్నం పెడుతున్న సుజాత వులిక్కిపడి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా తెల్లటి పాంటుపై తెల్లటి బుష్‌షర్టు టక్ చేసి నడుముకు నల్లటి బెల్టు వింతగా మెరుస్తుంటే చిరునవ్వుతో మెరిసే కళ్ళని తనవైపు కేంద్రీకరించి చిలిపిగా చూస్తున్న రజని.

అంకుల్ అంటూ ఉరికివస్తున్న చైతన్యను రెండు చేతులతో పైకెత్తి గట్టిగా బుగ్గపై ముద్దు పెట్టుకున్నాడు రజని.

"మెనీ మెనీ హేపీ రిటర్న్ ఆఫ్ ది డే, దిసీజ్ మై హార్టీ ప్రెజంటేషన్ టు మై హార్ట్" అంటూ తమ తెచ్చిన పెన్నును చైతన్య కిచ్చాడు రజని.

"చాలా బాగుంది అంకుల్ ! ఏదీ," అంటూ రజని రెండు బుగ్గలపైనా ముద్దు పెట్టుకున్నాడు చైతన్య. ప్రక్కనే నిలబడివున్నా తన్నుతాను మర్చిపోయి తన్మయత్వంలో మునిగిపోయింది సుజాత.

తిరిగిరాని వసంతం

"బాబూ ! మమ్మీ మనకు స్వీట్స్ పెట్టదా!" అంటున్న రజని మాటలకు తేరుకుని చిరునవ్వుతో స్వీట్స్ తేవడానికి లోనికెళ్ళింది.

"మమ్మీ నోరు తెరుప్, అంకుల్ నోరు తెరుప్" అంటూ చైతన్య ఇద్దరికీ స్వీట్స్ అందిస్తూ కేరింతలు కొట్టసాగాడు. మధ్య మధ్యలో సుజాత విసుక్కోవడం గమనించాడు చైతన్య.

"అబ్బ ! ఈ గులాబీలు చాలా బాగున్నాయి" టేబుల్‌పై రాశిగా పోసిన గులాబీల నుండి ఒక పువ్వును తీసి వాసన చూస్తూ అన్నాడు రజని.

"అంకుల్ అవన్నీ మా తోటలోవే ! ఇంకా చాలా పూలున్నాయి మా తోటలో, మమ్మీ అంకుల్‌కు మన తోట చూపిద్దాం రావూ !" అంటూ తోటలోకి దారితీశాడు చైతన్య.

రకరకాల పూల మొక్కలు, పూయని మొక్క లేదు. ఒకపక్క నందివర్ధనం మందార చెట్లు పక్కపక్కగా విరగపూసి ఆ తోటకే ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. సన్నజాజి, మల్లె పందిళ్ళ పందిరికి దట్టంగా అల్లుకుని తమకు, పందిరికివున్న బంధాన్ని లోకానికి చాటుతున్నాయి. ఒక్కొక్క పూవుని చూస్తూ, చైతన్య మాటలు వింటూ మెల్లగా నడుస్తున్నాడు రజని. ప్రతి మొక్క ఆకులను పువ్వులను జాగ్రత్తగా చూస్తూ సరిగ్గాలేని కొమ్మలను సవరిస్తున్న సుజాత తెల్లటి చీరలో విరిసిన మల్లెపందిరిలా అనిపించింది రజనికి. పువ్వుల అందాలని సహజంగా పొందిన సుజాతను తన్మయత్వంతో చూస్తుండిపోయాడు రజని.

"బాగా అలసిపోయాడు వెధవ. నిద్ర ముంచుకొచ్చింది ! బాగా విసిగించాడనుకుంటాను మిమ్మల్ని" అంది సుజాత భోజనం ప్లేటును సర్దుతూ.

"పిల్లలతో ఆడుకోవడం విసుగనిపించదు నాకు. నిజానికి అంతసేపూ ఈ లోకాన్నే మరచిపోవచ్చు అనిపిస్తుంది నాకు" అంటూ టేబిల్‌పై వున్న పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు రజని.

ఎలాగైనా ఇప్పుడే అడిగేయాలి ! మనసెందుకో తొందరపెడుతూంది. కాని, ఏమంటుందో అని సందేహం. ఏమైనా అననీ; ఒక దృఢ నిశ్చయానికి వచ్చాడు రజని.

చేతులు తుడుచుకుంటూ వచ్చిన సుజాతతో "మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి అలా కూర్చుంటారా" అన్నాడు.

ప్రసంగ ధోరణి మారేసరికి ఆశ్చర్యపోయి మెల్లగా ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంది.

"నా గురించి మీ అభిప్రాయ మేమిటి ?" సూటిగా వచ్చిన ప్రశ్నకు విస్తుపోయింది సుజాత.

'మీ కిష్టమైతేనే చెప్పండి. లేకపోతే లేదు" అన్నాడు.

ఒక్కక్షణం తటపటాయించింది. "నాకు తెలిసినంతవరకూ మంచి మనసున్న మనిషి" మెల్లిగా అంది.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను మీకు అభ్యంతరం లేకపోతే ! మీ గురించి పూర్తిగా తెలుసుకోకుండా ఇలా మాట్లాడుతున్నానని అనుకోవద్దు. నాకు అంతా తెలుసు. మీమీద జాలికొద్దీ నేనీ నిర్ణయానికి రాలేదు. ఎందుకంటే నేనీ నిర్ణయానికి రాకముందే మీ గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకున్నాను. ఇందులో నా స్వార్థం లేకపోలేదు. నేను మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆరాధిస్తున్నాను. ఒక మంచి మనసు కోసం నేను చేస్తున్న అన్వేషణలో, నా జీవితంలో ఇంతవరకూ అలాంటివారు తటస్థపడలేదు. ఇకపోతే ఈ సంఘం, అది సృష్టించే సమస్యల గురించి మీ అభిప్రాయాలు ఏ విధంగా వుంటాయో నేనూహించగలను."

"కాని ... మీరు ..." ఏదో చెప్పబోయింది సుజాత.

"మీరు తీరిగ్గా ఆలోచించుకోండి. ఇప్పుడేమి చెప్పవద్దు. రేపు సాయంత్రం వస్తాను" అంటూ లేచి వెళ్ళిపోతున్న రజనీవైపు చూస్తూ నీరసంగా వెనక్కి వాలిపోయింది సుజాత.

మనసు కకా వికలమైపోయింది. నిశ్చలంగా వున్న సరోవరం నీటిలో రాయి విసిరి సంచలం రేపినట్లయింది. ఇన్నాళ్ళూ రజని పరిచయంతో మానసిక చైతన్యం పొందుతున్నట్లనిపిస్తుంటే దాని ఫలితం ఇదని అనుకోలేదు. మెదడులో ఆలోచనల

వర్షం ప్రారంభమైంది. తనకు ఊహ తెలిసినప్పటి నుండి తన జీవితం తన ప్రమేయం లేకుండా అనుకోని మలుపులు తిరిగింది. ఆలోచనలు గతంలోకి పరుగు తీస్తుంటే భారంగా కళ్ళు మూసుకుంది సుజాత.

తను బి. య్యే. పరీక్షలు రాసి ఇంటికి రాగానే తల్లిదండ్రులు పెళ్ళి నిశ్చయించారు. వివాహం, భర్త, సంసారం గురించి ఒక నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోకముందే రఘురాం భర్తగా తన జీవితంలోకి ప్రవేశించాడు.

తరువాత రఘురాం ఏక్సిడెంట్‌లో ఈ లోకం విడిచినా అతని ప్రేమానురాగాల ఫలితంగా తన కడుపులో శిశువు పెరుగుతున్నదని గ్రహించిననాడు, విధి తనకు ప్రసాదించినది అదృష్టమో, దురదృష్టమో తేల్చుకోలేక పోయింది. తల్లిదండ్రులు వేరే ప్రయత్నాలలో వుండగా తను ఇక్కడికి వచ్చేసింది.

"ఈ ప్రపంచంలో తనకొక బంధం బాబు. బాబుని చదివించి పైకి తీసుకురావాలనే ధ్యేయం కల్పించుకున్నా ఇప్పుడు రజని పరిచయం తన జీవితంలో మరో మలుపుకు నాంది పలుకుతోంది, అనే విషయం విచిత్రంగా తోస్తోంది.

* * *

ఉదయం నుంచి వాతావరణం అల్లకల్లోలంగా వుంది. వుండి వుండి గాలి హోరున వీస్తోంది ఆలోచిస్తూ కూర్చున్న సుజాత 'అమ్మా సుజాతా' అంటూ వచ్చిన పార్వతమ్మ పిలుపుకు బైటికి వచ్చింది.

ఎదురింట్లో వుంటున్న పార్వతమ్మ అప్పుడప్పుడూ వచ్చి ఆవిడ కొడుకు కోడళ్ల విషయాలు, లోకంపోకడలు చెప్తూ వుంటుంది.

"ఏమ్మా ! అలా నీరసంగా వున్నావ్? ఒంట్లో బాగాలేదా?" అంటూ ముఖంమీద అడిగేసరికి సుజాత ఒక్క క్షణం ఖంగారు పడింది. ఆలోచనా భారంతో వడలినట్లున్న ముఖాన్ని మామూలుగా వుంచడానికి ప్రయత్నిస్తూ,

"ఆఁ. ఏమీ లేదండి కొంచెం తలనొప్పిగా వుంది అంతే" అంది తెచ్చి పెట్టుకున్న నవ్వుతో.

"అంతేనా ! పోనీలె, నేనుకూడా, ఏదో కాస్త తెరిపెగా వుంటుంది మాట్లాడుకుంటుంటే అని వచ్చాను" అంది.

"అదేవిటండీ పనిమనిషి వుండగా మీకంత శ్రమెందుకు కల్గింది" అంది ఆశ్చర్యంగా !

"ఇవ్వాళ అది రాలేదమ్మా ! దాని కొడుకు ఇంట్లోంచి పారిపోయాడట. అందుకనే, పోలీస్ స్టేషననీ అదనీ, ఇదనీ తిరుగుతోంది. ఆ కొడుకు తండ్రి చిన్నప్పుడే పోయాడట. అప్పటినుండి ఎవడో దానితో వుంటున్నాడట అయినా ఏ వయసులో జరిగేవి ఆ వయసులో జరగాలి. పాడులోకం కాకపోతే, ఆ కొడుక్కి ఇప్పుడు తెలిసొచ్చిందట వాడెమో ఇంట్లో వుండనని పారిపోయాడట." అంటూ తనకు తోచినట్లు చెప్పుకుపోతోంది పార్వతమ్మ.

ఈదురుగాలి వేగం హెచ్చింది. వర్షం రాబోతున్నట్లుగా ఆకాశం మేఘాలతో కమ్ముకొంది కిటికీలు, తలుపులు దబదబా కొట్టుకుంటున్నాయి

బయట చెలరేగే తుఫానుకు పోటీగా సుజాత అంతరంగంలో ఆలోచనల తుఫాను మొదలైంది

"బట్టలు బైట ఆరేశాను, గాలి వీస్తోంది, వెళ్తొస్తానమ్మా" అని వెళ్ళిపోయింది పార్వతమ్మ

"అమ్మా ఆకలౌతోంది" అంటూ కుదుపుతున్న బాబును చూసి ఈ లోకంలోకి వచ్చింది సుజాత కిటికీలు తలుపులు అన్నీ వేసి బాబుకు అన్నం పెట్టి పడుకోబెట్టింది.

* * *

"తనకోసం ఎదురుచూస్తూ వుంటుంది సాయంత్రమే వస్తానని చెప్పాను. ఈ పాడు తుఫాను శనిలా దాపురించింది. అయితే ఏం ! సుజాతకు తనంటే ప్రేమ వుంది. తప్పకుండా అంగీకరిస్తుంది" అనుకుంటూ సుజాత ఇంటివేపు గబగబా అడుగులు వేస్తున్నాడు రజని.

సంతోషంతో కదం త్రొక్కుతున్న మనసును అదిమిపెట్టి మెల్లిగా గేటుతీసి లోనికి అడుగు పెట్టాడు. కాలిబాట నిండా ఆకులు, కొమ్మలు చిందర వందరగా పడివున్నై. మొక్కలన్నీ నేల కొరిగిపోయి లేవలేనట్లు అయిపోయినై పూలన్నీ వాననీటికి చివికి దీనంగా చూస్తున్నై. తోటంతా భీభత్సంగా తయారైంది. చుట్టూ పరికించుతూ తలుపును సమీపించిన రజనికి, తలుపుకు వేళ్ళాడుతూ వెక్కిరిస్తున్న తాళం సాక్షాత్కరించింది. చుట్టూ శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది. ★

ఆంధ్రపత్రిక

జంషెడ్‌పూర్‌లో తెలుగువారికి...

ఇప్పుడు జంషెడ్‌పూర్‌లో ఆంధ్ర సచిత్ర వారపత్రికతోపాటు ఆంధ్రపత్రిక దినపత్రిక కూడా లభిస్తోంది.

దినపత్రిక కావలసినవారు మా వారపత్రిక అమ్మేచోట అడగండి. లేదా మా ఏజెంటును సంప్రదించండి.

: మా ఏజెంటు చిరునామా :

మెస్సర్స్ సన్యాల్ బ్రదర్స్,
బారి భవనం, మొదటి అంతస్తు, మెయిన్ బజారు,
జంషెడ్‌పూర్ - 831 001